క్లుప్తంగా

సైబర్‌నేరాలతో మోసపోవద్దు

లింగాల: సైబర్ నేరాలకు మోసపోవద్దని హెడ్ కానిస్టేబుల్ వెంకటేష్ ప్రజలను, విద్యార్థులను కోరారు. మంగళవారం మండల కేంద్రంలో పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులకు పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. సైబర్ నేరగాళ్లు ఏ రకంగా మోసాలు చేస్తారనే విషయాలను, మోసాలకు గురికాకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే దానిపై తెలియజేశారు. పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి, మోతిలాల్ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై అవగాహన

వెల్దండ: మండల కేంద్రంతో పాటు పెద్దాపూర్‌లో మంగళవారం పంటల సాగుపై రైతులకు అగ్రికల్చర్ యూనివర్సిటీ రాజేంద్రనగర్ శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు సాగుచేసిన పంటలపై ఏప్రిల్, మే నెలలో వడగండ్ల, వర్షాలు రావడంతో తీవ్రంగా నష్టపోతున్నారు. వాతావారణంలో మార్పులు రావడంతో పంటలు నష్టపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. నూతన వంగడాలను ఉపయోగించి పంటల సాగు, మరో నెల ముందు సాగు చేసేందుకు విత్తనాలను వినియోగించాలన్నారు. శాస్త్రవేత్తలు డాక్టర్ కిరణ్, స్పందన, ఏఈఓలు సురేష్‌గౌడ్, గణేష్ ఉన్నారు.

సర్పంచ్‌ల నిరసన

వెల్దండ: గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు చెల్లించాలని కోరుతూ మంగళవారం సర్పంచ్‌లు మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో జాతీయ ఉపాధిహామీ పథకం ద్వారా చేపట్టిన సీసీ రోడ్లు, వివిధ అభివృద్ధి పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదన్నారు. సర్పంచ్‌లు రామకృష్ణ, రామచంద్రారెడ్డి, దార్లకుమార్, పత్యానాయక్, బీరయ్య పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

కల్వకుర్తి రూరల్: మండలంలోని వెంకటాపూర్ గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం గ్రామంలోని వీరనాగమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం అనారోగ్యంతో బాధపడుతున్న శ్రీశైలం, ఆంజనేయులు, వెంకటయ్య కుటుంబాలను పరామర్శించి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

ఎమ్మెల్సీ ఇవ్వాలి

కల్వకుర్తి రూరల్: రాష్ట్రంలో క్రైస్తవ సమస్యలపై నిరంతరం పోరాటం చేయడంతో పాటు భారత రాష్ట్ర సమితి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న సాల్మాన్ రాజుకు గవర్నర్ కోటాలో సీఎం కేసీఆర్ ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని నాగర్‌కర్నూల్ జిల్లా ఫాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జాన్‌రామస్వామి కోరారు. మంగళవారం కల్వకుర్తిలోని చర్చిలో జిల్లా స్థాయి ఫాస్టర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మెన్నో జోయల్, రాజనందన్, రూపక్, దేవదాస్, రాజరత్నం, జంగయ్య పాల్గొన్నారు.

చిరువ్యాపారులకు అండగా ఉంటా..

కల్వకుర్తి రూరల్: చిరువ్యాపారులకు అండగా ఉంటానని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్‌రెడ్డి చెప్పారు. మంగళవారం కల్వకుర్తి కూరగాయల మార్కెట్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా చిరు వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా వారిని అడిగి తెలుసుకున్నారు. ఐక్యతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యా, వైద్యం, ఉపాధికి అండగా నిలుస్తున్నామని, చిరు వ్యాపారులు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు తమవంతు సహకారం అందిస్తామని తెలియజేశారు.

కొనసాగుతున్న పూజలు

కల్వకుర్తి: పట్టణంలోని ఝాన్సీ లక్ష్మీబాయి రోడ్డులోని భీమేశ్వర శివాలయంలో పూజలు కొనసాగుతున్నాయి. ఆలయ ఆవరణలో విగ్రహాల ప్రతిష్ఠాపన సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. మంగళవారం ప్రాతఃకాల రుద్రహోమం నిర్వహించారు.

అక్షరాస్యతపై అవగాహన అవసరం

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సును యూనియన్ బ్యాంక్ మేనేజర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజలు, రైతులు డబ్బును ఎలా జమ చేసుకోవాలి, ఎలా నిల్వ చేసుకోవాలి, రుణసౌకర్యం పొందుట, కట్టుట, ఇన్సూరెన్స్ పాలసీలపై అర్థమయ్యేలా యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో వివరించారు. యూనియన్ బ్యాంక్ మేనేజర్ విజయ్‌కుమార్, ఫీల్డ్ ఆఫీసర్ మౌలాలి, జనార్దన్, చిన్నికృష్ణ పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

తెలకపల్లి: మండల పరిధిలోని రాకొండలో బొడ్రాయి ఉత్సవాల్లో భాగంగా చివరి రోజు మంగళవారం వివిధ గ్రామాల నుంచి బంధువులు రాకొండకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో మంగళవారం రాత్రి రాకొండకు చెందిన సాయి బైక్‌పై, లింగాల మండలం వల్లభాపూర్‌కి చెందిన లక్ష్మయ్య లూనపై వస్తూ ప్రమాదవశాత్తు ఢీకొన్నారు. లక్ష్మయ్యకు తీవ్ర గాయాలైనట్లు ఎస్‌ఐ తెలిపారు. రాకొండ సాయి మనుమడికి కూడా స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. వారిని ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ ప్రదీప్ కుమార్ వివరించారు.

ప్రతిభను వెలికితీసేందుకే క్రీడలు



వాలీబాల్ ఆడుతున్న జటప్రోల్, సింగవరం జట్లు

వెల్దండ: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను వెలికితీసేందుకు ప్రభుత్వం సీఎం కప్ క్రీడలు నిర్వహిస్తుందని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలియజేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మండల స్థాయి సీఎం కప్ క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆటల్లో స్నేహాభావంతో మెలగాలన్నారు. క్రీడలను ప్రోత్సహించడానికి గ్రామాల్లో క్రీడా మైదానాలను ఏర్పాటు చేసిందన్నారు. అథ్లెటిక్స్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు తెలియజేశారు. 22 నుంచి 24 వరకు జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఎంపీపీ విజయ, జెడ్పీటీసీ విజితారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ చంద్రశేఖర్, శంకర్‌నాయక్, జైపాల్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో బాలుర జిల్లా పరిషత్ పాఠశాలలో ఆటల పోటీలు ఎంపీడీఓ రామయ్య ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. ఉత్తమ ప్రదర్శన కనబర్చిన వారిని జిల్లా స్థాయికి ఎంపిక చేసినట్లు ఎంపీడీఓ రామయ్య తెలియజేశారు. బుధవారం చివరి రోజు ఈ ఆటలు నిర్వహిస్తామని ఎంపీడీఓ రామయ్య, తహసీల్దార్ దామోదర్ తెలియజేశారు.



కల్వకుర్తిలో క్రీడాకారుల పరిచయం

ఉత్సాహంగా క్రీడలు

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని జ్యోతిబాపూలే పాఠశాల ఆవరణలో మంగళవారం సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆంజనేయులు, చెన్నకేశవులు క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌తో పాటు పలు పోటీలను నిర్వహించారు. వాలీబాల్ పోటీల్లో మార్చాల జట్టు విజేతగా నిలవగా, కబడ్డీలో వెంకటాపూర్ తండా జట్టు విజయం సాధించింది.

క్రీడలతో మానసిక ఉల్లాసం

తాడూరు: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని ఇస్తాయని సింగిల్‌విండో చైర్మన్ ఎండీ సమ్మద్‌పాషా అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో తెలంగాణ క్రీడా ప్రాంగణంలో సీఎం కప్పు క్రీడా పోటీలు ప్రారంభించారు. 10 గ్రామపంచాయతీల్లో 120 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఎస్‌ఐ శ్రీనివాసులు, ఎంపీడీఓ గంగామోహన్, ఎంఈఓ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.



అమ్రాబాద్‌లో క్రీడాకారుల పరిచయం

రెండు మండలాల్లో..

అమ్రాబాద్: పదర, అమ్రాబాద్ మండల కేంద్రాల్లో మంగళవారం సీఎం కప్ క్రీడలను నిర్వహించారు. అమ్రాబాద్ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, పదర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మైదానాల్లో అమ్రాబాద్ ఎంపీపీ శ్రీనివాసులు, ఎంపీడీఓ రాంమోహన్, పదరలో జెడ్పీటీసీ రాంబాబునాయక్, ఎంపీడీఓ శంకర్‌నాయక్ క్రీడలను ప్రారంభించారు.

కోడేరు: మండలంలోని నర్సాయిపల్లిలో సీఎం కప్ మండల స్థాయి ఆటల పోటీలను ఎంపీడీఓ శ్రావణ్ కుమార్ ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. సర్పంచ్ సత్యనారాయణయాదవ్, పంచాయతీ కార్యదర్శులు రవితేజ, పీఈటీలు కుర్మయ్య, బాలస్వామి పాల్గొన్నారు.

పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలి



సభలో మాట్లాడుతున్న చైర్మన్ హన్మంత్‌రెడ్డి

లింగాల: పట్టుదలతో చదివి ఉన్నత స్థాయికి ఎదగాలని సింగిల్‌విండో చైర్మన్ జంబుల హన్మంత్‌రెడ్డి పది ఉత్తీర్ణులైన విద్యార్థులను కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఫౌండేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో పదో తరగతిలో ఉత్తమ జీపీఏ సాధించిన పలు పాఠశాలల విద్యార్థులను ఘనంగా సన్మానించారు. నేడు ప్రభుత్వం కార్పొరేట్ తరహాలో ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను బలోపేతం చేస్తూ.. నాణ్యమైన విద్యను అందించేందుకు ఎంతగానో కృషి చేస్తుందని అన్నారు. అనంతరం విద్యార్థులను శాలువాలతో సన్మానించి జ్ఞాపికలను అందజేశారు. తహసీల్దార్ మునీరొద్దీన్, లింగాల, అంబట్‌పల్లి హెచ్‌ఎంలు శేఖర్, తాహెర్‌పాష, శ్రీనివాసులు, హెచ్‌సీ వెంకటేష్, మోతీలాల్ పాల్గొన్నారు.

ప్లాట్ల ఏర్పాటుపై ఫిర్యాదు

తాడూరు: మండల కేంద్రంలో సర్వే నంబర్ 421 ఆనుకుని ఉన్న భూమిలో అక్రమంగా వెంచర్ ఏర్పాటు చేస్తున్నారని మంగళవారం తహసీల్దార్ కార్తీక్‌కుమార్‌కు గ్రామానికి చెందిన సందమల్లయ్య ఫిర్యాదు చేశారు. ఈ భూమికి సంబంధించి హైకోర్టులో విచారణలో ఉందని, అందుకు సంబంధించి విషయాలు తేలకముందే వెంచర్ ఏర్పాటు చేస్తున్న వ్యక్తులపై చర్యలు చేపట్టాలన్నారు.

మాజీ మంత్రి పరామర్శ

కోడేరు: మండల కేంద్రానికి చెందిన మూర్తమ్మ అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందడంతో ఆ కుటుంబాన్ని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు పరామర్శించారు. మండల కోఆప్షన్ సభ్యులు అబ్దుల్ కరీం, రామకృష్ణ, ఉస్మాన్, మహేష్, పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

తోటపల్లిలో ఎమ్మెల్యే

కల్వకుర్తి రూరల్: మండలంలోని తోటపల్లిలో లక్ష్మణాచారి రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.20 వేల సాయం అందించారు.

చెత్తను వేర్వేరుగా సేకరించాలి



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న శిరీష

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ పరిధిలో ఇంటింటికీ తిరిగి సేకరిస్తున్న చెత్తను తడి, పొడి చెత్తగా సేకరించాలని రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఇంజనీర్ శిరీష అన్నారు. మంగళవారం పట్టణంలోని సీబీఎం కళాశాల వెనుక భాగంలో నూతనంగా నిర్మిస్తున్న డంపింగ్‌యార్డు, సెగ్రిగేషన్ షెడ్డును మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. పనులను త్వరగా పూర్తిచేసి వీటన్నింటిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని ఏఈకి సూచించారు. నాణ్యతగా పనులు చేపట్టాలని, నాసిరకమైన పనులను చేపడితే చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా సంఘాల సభ్యులతో ప్రతిజ్ఞ చేయించారు. మున్సిపల్ మేనేజర్ రాజకుమారి, ఏఈ శివకృష్ణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తస్లీమ్, శివ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికులకు వైద్య పరీక్షలు

కొల్లాపూర్: సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో లేబర్ గుర్తింపు కార్డులు ఉన్న కార్మికులకు మూడు రోజులు నిర్వహిస్తున్న వైద్యశిబిరం మంగళవారం ముగిసింది. కార్మికులు శిబిరంలో వైద్య పరీక్షలు చేయించుకున్నారు. శిబిరాన్ని కార్మిక శాఖ అధికారి వేణుగోపాల్ పర్యవేక్షించారు.

పాడి రైతులకు అండగా ఉంటాం..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి: రాష్ట్రంలో రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని, పాడి రైతులకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ చెప్పారు. మంగళవారం పట్టణంలోని పాలశీతలీకరణ కేంద్ర ఆవరణలో డివిజన్ పరిధిలోని పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడారు. పాడి రైతులకు విజయ డైరీ, ఎస్‌బీఐ బ్యాంకు ఒప్పందంతో ప్రభుత్వం ముద్ర రుణ సదుపాయం కల్పిస్తుందని చెప్పారు. దాణ నాసిరకంగా వస్తుందని, దీంతో పాలదిగుబడి తగ్గిపోయి నష్టపోతున్నామని ఎమ్మెల్యే ఎదుట రైతులు వాపోయారు. వెంటనే ఎమ్మెల్యే రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. జిల్లా అధికారి సత్యనారాయణ యాదవ్, రమేష్, శివాల్కర్, సుధాకర్, శ్రీధర్ పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

వెల్దండ: మండల పరిధిలోని కొట్రకు చెందిన దేశమోని సైదులు మూడు ఎకరాల్లో వరి పంటను నూర్పిడి చేశాడు. పశువుల కోసం గడ్డివాము వేసేందుకు సిద్ధం చేశాడు. రెండు ఎకరాల్లో మొక్కజొన్న పశుగ్రాసం ఉంది. ప్రమాదవశాత్తు నిప్పు పడిందా, ఎవరైనా గుర్తు తెలియన వ్యక్తులు నిప్పు పెట్టారో తెలియాల్సి ఉంది. పశుగ్రాసం పూర్తిగా దగ్ధమైంది. అగ్నిసిబ్బందికి సమాచారం అందించగా.. వారు వచ్చి మంటలు ఆర్పినా ఫలితం లేకుండాపోయింది. గ్రాసం విలువ రూ.50 వేల విలువ ఉంటుందని రైతు పేర్కొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

కల్వకుర్తి: డబుల్ బెండ్రూం ఇళ్ల కేటాయింపులో తమకు అన్యాయం జరిగిందని ఇందిరానగర్ కాలనీవాసులు కొన్ని రోజులుగా ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. మూడు రోజులుగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌ను కలిసి తమకు జరిగిన అన్యాయాన్ని సరిచేయాలని వినతి అందించారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్డీఓ రాజేష్ కుమార్‌కు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. బాధితులంతా ఆర్డీఓ కార్యాలయానికి వెళ్లి వినతి అందజేశారు.

సమన్వయంతో అభివృద్ధికి కృషి చేయాలి



వెల్దండ సర్వసభ్య సమావేశంలో కింద కూర్చొని నిరసన తెలుపుతున్న ఎంపీటీసీలు

వెల్దండ: ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో మండల అభివృద్ధికి కృషి చేయాలని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఎంపీపీ విజయ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండల సభకు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న నిధులతో మండలాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసుకోవాలన్నారు. సభ్యులు విద్యుత్ సమస్య తీవ్రంగా ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో విద్యుత్ అధికారులు సమాధానం చెప్పాలని ఎమ్మెల్యే అన్నారు. విద్యుత్ అధికారులు సభకు హాజరుకాకపోవడంతో ఎమ్మెల్యే ఫోన్ ద్వారా మాట్లాడారు. మండలాన్ని సందర్శించి విద్యుత్ సమస్యను తీర్చాలన్నారు. తాగునీటి సమస్యపై చర్చించారు. బైరాపూర్, చొదర్‌పల్లి గ్రామాలకు మిషన్ భగీరథ నీరు రావడం లేదన్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వితారెడ్డి, తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంపీడీఓ శ్రీనివాసులు, సునీత, మోహన్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

కోరం లేదని సభ్యులు నిరసన..

మండల సర్వసభ్య సమావేశాన్ని కోరం లేకుండా ఎలా ప్రారంభిస్తారని బీజేపీ ఎంపీటీసీ చక్రవర్తిగౌడ్, కాంగ్రెస్ ఎంపీటీసీ సభ్యులు మోతిలాల్‌నాయక్ నిరసన తెలిపారు. సభ్యులకు, ఎంపీడీఓ, జెడ్పీటీసీ, ఎంపీపీలతో వాగ్వాదం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసులు కల్పించుకొని గొడవ సద్దుమనిగించారు.

అభివృద్ధి చెందాలి

తెలకపల్లి: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఎంపీపీ కొమ్ము మధు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను, పసుపు తయారీ యంత్ర కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో ఎదగాలని, ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. తెలకపల్లికి చెందిన ఎత్తపు కాశమ్మ, పార్వతీ దేవి మహిళా సంఘాలకు రూ.2 లక్షల రుణంతో పసుపు తయారీ మిషన్‌ను అందించారు. ఇలాంటి వారికి ప్రభుత్వం 35 శాతం సబ్సిడీతో బ్యాంకు రుణాన్ని మంజూరు చేస్తుందన్నారు. శ్రావన్‌కుమార్, నరేష్, రమేష్, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

కల్లు గీత సంఘం అధ్యక్షుడిగా అంజయ్య

వెల్దండ: మండల పరిధిలోని పెద్దాపూర్‌లో మంగళవారం ఎక్సైజ్ ఎన్నికల అధికారి మహబూబ్ అలీ ఆధ్వర్యంలో పెద్దాపూర్ కల్లుగీత సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు అంజయ్యగౌడ్, ఉపాధ్యక్షుడిగా శేఖర్‌గౌడ్, కార్యదర్శిగా వెంకటయ్యగౌడ్‌ను ఎన్నుకున్నారు.

సమస్యలు పరిష్కరించాలని నిరసన

కోడేరు: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ.. మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీఐటీయూ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. మండలంలో పనిచేస్తున్న అంగన్‌వాడీ టీచర్లకు బీఎల్‌ఓల డ్యూటీకి సంబంధించిన 2018 నుంచి ఇప్పటి వరకు డబ్బులు ఇవ్వలేదని కొల్లాపూర్ ఐసీడీఎస్ సమావేశాలకు వెళ్లినా టీఏడీఏ డబ్బులు కూడా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ మల్లికార్జున్‌రావుకు అందజేశారు. అంగన్‌వాడీ సిబ్బంది వరలక్ష్మీ, పద్మ, నాగమణి, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్ల పనులు ప్రారంభం

అమ్రాబాద్: వంకేశ్వరంలో మంగళవారం రూ.70 లక్షల సీసీ రోడ్ల నిర్మాణం పనులను జెడ్పీటీసీ రాంబాబునాయక్, సర్పంచ్ దశరథ్‌నాయక్, వైస్‌ఎంపీపీ వరుణ్‌కుమార్ ప్రారంభించారు.

డయాగ్నోస్టిక్ సెంటర్ ప్రారంభం



దయాగ్నోస్టిక్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

మన్ననూర్: నాగర్‌కర్నూల్ జిల్లాలోని మన్ననూర్ పీహెచ్‌సీ ఆవరణలో నూతనంగా నిర్మించిన డయాగ్నోస్టిక్ సెంటర్, (వ్యాధుల నిర్ధారణ భవనం) చెంచు లక్ష్మి రెస్టారెంట్ భవనాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజుతో కలిసి గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ మంగళవారం ప్రారంభించారు. ప్రభుత్వం రూ.90 లక్షలు వ్యయం చేసి నిర్మించిన ఈ భవనంలో సుమారు 45 రకాల వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేసేందుకు వీలు కలుగుతుందన్నారు. జిల్లా కేంద్రం తర్వాత జిల్లాలో ఇలాంటి సెంటర్ ఏర్పాటు చేయడం ఇదే మొదటిదని అన్నారు. కేంద్రంలో పూర్తిస్థాయిలో వైద్య సిబ్బందిని కేటాయించి ఆదివాసీలు, ఈ ప్రాంత ప్రజలకు అన్ని రకాల వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి, ఎమ్మెల్యే ఈ సందర్భంగా తెలియజేశారు. ఐటీడీఏ సమక్షంలో నిర్మాణం చేసి, ప్రైవేటు వ్యక్తులకు లీజుకు ఇచ్చిన చెంచు లక్ష్మి రెస్టారెంట్‌ను కూడా మంత్రి ప్రారంభించారు. అంతకు ముందు జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవాన్ని పురస్కరించి వైద్య సిబ్బంది నిర్వహించిన ర్యాలీలో మంత్రి, ఎమ్మెల్యే పాల్గొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ మనూ చౌదరి, ఆర్డీఓ పాండు నాయక్, డీటీడీఓ కమలాకర్‌రెడ్డి, జీసీసీ మేనేజర్ సంతోష్‌కుమార్, జాఫర్, సీడీపీఓ దమయంతి, సర్పంచ్ శ్రీరాం నాయక్, ఎంపీపీ శ్రీనివాసులు, పదర జెడ్పీటీసీ రాంబాబు పాల్గొన్నారు.

పాఠశాల పనులు పరిశీలన



కుమ్మెరలో పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మర్రి

తాడూరు: మండల కేంద్రంలో ఎంజేఆర్ ట్రస్ట్ ద్వారా చేపట్టిన ఉన్నత పాఠశాల పనులను ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పేద విద్యార్థుల కోసం ఆధునిక హంగులతో పాఠశాల భవనాన్ని నిర్మిస్తున్నామన్నారు. అభివృద్ధి పనుల్లో రాజీ పడకుండా నాణ్యతతో చేపట్టాలన్నారు.

గంగమ్మ ఉత్సవాల్లో..

మండలంలోని గుంతకోడూరులో ముదిరాజుల ఆరాధ్యదైవం గంగమ్మతల్లి ద్వితీయ బ్రహ్మోత్సవాల్లో ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి మంగళవారం పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: మండల పరిధిలోని కుమ్మెరలో మెగా కంపెనీ నిర్మిస్తున్న జెడ్పీ ఉన్నత పాఠశాల పనులను ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు.

ఎల్‌ఓసీ..

మండల పరిధిలోని కుమ్మెరకి చెందిన పల్లె మధు కొన్ని రోజులుగా కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. ఆపరేషన్ నిమిత్తం ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి రూ.2.50 లక్షల ఎల్‌ఓసీని మంగళవారం అతని కుటుంబ సభ్యులకు అందజేశారు.

కారుకొండలో మర్రి

బిజినేపల్లి: మండలంలోని కారుకొండలో నిర్వహిస్తున్న ఎల్లమ్మ తల్లి ఉత్సవాలకు ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా గ్రామంలో డా.అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎల్లమ్మ ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. సీత రాముల, ఆంజనేయస్వామి వార్లను ఎమ్మెల్యే దర్శించుకున్నారు.

ఆర్థికసాయం అందజేత

తాడూరు: మండలంలోని అంతారానికి చెందిన సర్వేలుబాబు రెండు కళ్లను కోల్పోయాడు. కొన్ని రోజులుగా కంటిచూపు కోల్పోయి బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే మర్రిజనార్దన్ రెడ్డి గ్రామానికి చేరుకుని రూ.75 వేల ఆర్థిక సాయం అందించారు.

మోసపూరిత వాగ్దానాలు నమ్మొద్దు



అప్పాయపల్లిలో మాట్లాడుతున్న వంశీకృష్ణ

లింగాల: పాలకుల వాగ్దానాలను నమ్మి మరో సారి మోసపోవద్దని మాజీ ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ కోరారు. మంగళవారం రెండో రోజు మండల పరిధిలోని అప్పాయపల్లిలో 'హాథ్ సే హాథ్ జోడో' యాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా పలు వార్డుల్లో పార్టీ శ్రేణులతో కలిసి తిరిగి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చేసిన అభివృద్ధి పనులను గుర్తు చేసుకుని పార్టీని ఆదరించాలని కోరారు. నాగేశ్వర్‌రావు, శశిధర్, సురేందర్ రాజు, నిరంజన్, లక్ష్మణ్‌నాయక్, బుడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే..

అమ్రాబాద్: బీఆర్‌ఎస్ పాలనపై విముఖతతో ఉన్న ప్రజలు వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తారని, ఇందుకోసం కార్యకర్తలు, నాయకులు సైనికుల్లా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని తిర్మలాపూర్‌లో కాంగ్రెస్ మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కార్యకర్తలందరూ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ శ్రీనివాసులు, నాయకులు శత్రునాయక్, హరినారాయణగౌడ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనూ కాంగ్రెస్‌దే విజయం

కల్వకుర్తి రూరల్: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని, కర్ణాటక గెలుపుతో నిరూపితమైందని యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు జోస్యం చెప్పారు. మంగళవారం కల్వకుర్తిలో విలేకరులతో మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయంతో బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు కలవర పడుతున్నారన్నారు. సమావేశంలో భరత్‌రెడ్డి, సుదర్శన్ పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించాలి



పెంట్లవెల్లిలో మాట్లాడుతున్న ఈశ్వర్

వెల్దండ: మండల కేంద్రంలో వీఓఏల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం వీఓఏలకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అందించాలని కోరారు. ఎంపీపీ విజయ, జెడ్పీటీసీ విజితారెడ్డి, ఎంపీటీసీలు వెంకటయ్య, రాములు పాల్గొన్నారు.

బీఎస్పీ మద్దతు..

వెల్దండలో సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలుపుతున్న వీఓఏలకు మద్దతుగా బీఎస్పీ అసెంబ్లీ ఇన్‌చార్జ్ కొమ్ము శ్రీనివాస్‌యాదవ్ సంఘీభావం తెలిపారు.

ప్రభుత్వం మొండి వైఖరిగా వ్యవహరిస్తుంది

పెంట్లవెల్లి: కొన్ని రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ఐకేపీ వీఓఏలు సమ్మె కొనసాగిస్తున్నా.. రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి చూపడం సరికాదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. మంగళవారం వీఓఏలకు మద్దతు తెలిపారు. ఈశ్వర్, బాలకృష్ణ, మురళి, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలతో సమ్మెలో పాల్గొన్న వీఓఏలు

లింగాల: ఐకేపీ వీఓఏల సమ్మెలో భాగంగా మంగళవారం తమ పిల్లలను దీక్షా శిబిరానికి తీసుకొచ్చి నిరసన వ్యక్తం చేశారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



పెద్దకొత్తపల్లిలో ర్యాలీ

ఉప్పునుంతల: పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవంపై మండల కేంద్రంలో వైద్యాధికారిణి స్వప్న, వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడారు. ఏడీస్ ఈజిప్టి అనే దోమ కాటుతో డెంగ్యూ వస్తుందని తెలియజేశారు. శరీరంపై దద్దుర్లు, చర్మం ద్వారా రక్తస్రావం, తీవ్రమైన తలనొప్పి, కండరాలు, కీళ్ల నొప్పులు వంటి వ్యాధి లక్షణాలు ఉంటాయన్నారు. ర్యాలీలో పీహెచ్‌ఎన్ జోన్స్, శ్రీనివాసులు, శంకరమ్మ, ప్రభావతి పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని డెంగ్యూ భారిన పడవద్దని డా.విజయ్ కుమార్ అన్నారు. మంగళవారం డెంగ్యూపై వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. డా. రోహిత్, శ్రీనివాసులు, చెన్నయ్య, నర్సింహగౌడ్, ఏఎన్‌ఎంలు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

కోడేరు: మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేయవద్దని కొల్లాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కిషన్‌నాయక్, సింగిల్ విండో చైర్మన్ చిన్నారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయంలో రైస్ మిల్లర్ల సమావేశం నిర్వహించారు. రైస్ మిల్లర్ల యాజమానులతో పండించిన వరిధాన్యాన్ని తప్పకుండా కొనుగోలు చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న కిషన్‌నాయక్